
సాక్షి ఏలూరు

శనివారం । 20 । జూలై । 2024



నారుమడుల్లో సస్యరక్షణ

భారీ వర్షాలకు సార్వా వరినాట్లు, నారుమడులు నీటమునుగుతున్నాయి. సరైన సస్యరక్షణ పద్ధతులు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో ▸



బోధనలో మేటి

ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ నూజివీడు ట్రిపుల్ఐటీ సొంతం. ఈనెల 22, 23 తేదీల్లో కౌన్సెలింగ్‌కు అధికారులు సిద్ధమవుతున్నారు. 8లో ▸



చూడి గేదెల్లో జాగ్రత్తలు

చూడి గేదెల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు. ఈనక పోవడానికి కారణాలను గుర్తించి చికిత్స అందించాలంటున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



టీడీపీ నేతల దాడిలో గాయపడిన భూక్యా వేణు

టి.నరసాపురం: రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారుల లక్ష్యంగా టీడీపీ శ్రేణులు దాడులకు తెగబడుతున్నాయన్నారు. వ్యక్తిగత కక్షలకు పాల్పడటం సరికాదన్నారు. పోలవరం నియోజకవర్గంలో సైతం కూటమి నాయకులు దాడులకు తెగపడుతున్నారని, వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా ఉన్నాడనే ఉద్దేశంతో టి.నరసాపురం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన భూక్యా వేణుపై దాడికి పాల్పడటం ఇందుకు నిదర్శనమన్నారు. కూటమి నేతల దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధైర్యపడొద్దని, అండగా ఉంటామని అన్నారు. కూటమి నేతల దాడులను చూస్తూ ఊరుకోబోమన్నారు. జగన్ నాయకత్వంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని బాలరాజు పేర్కొన్నారు.

హత్యాకాండపై స్పందించాలి



చాన్ బాషా

కైకలూరు: పల్నాడులో హత్యాకాండలపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ చాన్ బాషా డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త షేక్ అబ్దుల్ రషీద్‌ను అతి కిరాతకంగా హత్య చేయడం సభ్యసమాజానికే సిగ్గు చేటన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లావ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో శనివారం పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్టు డీఈఓ ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు మూసివేయాలని పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం, ఏలూరు డివిజన్లలో వర్షాలతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి పాఠశాలలు మూసివేయాలని అప్పటికప్పుడు ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జూనియర్ కళాశాలలకు శనివారం సెలవు ప్రకటించినట్టు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్ బాబు ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు ఈ ఆదేశాలు పాటించాలన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నేభవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కృష్ణా, గోదావరి డెల్టా పరిధిలో కాలువలు ఆధునీకరణ జరగకపోవడం, కాలువల్లో గుర్రపుడెక్క, తూడు, కర్రనాచు, కిక్కిస పేరుకుపోవడం ముంపునకు కారణమన్నారు. కాలువలు పూడిక తీత, ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.

వర్జీనియాకు రికార్డు ధర

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు ధర కిలో రూ.388 చేరి రికార్డు సృష్టించింది. శుక్రవారం కన్నాపురం క్లస్టర్‌కి చెందిన పొగాకు బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకురాగా కంపెనీలు పోటీపడి ధర పెంచాయి. 483 బేళ్లు రాగా 304 బేళ్లను కంపెనీలు కొనుగోలు చేశాయి. సగటు ధర రూ.313కు చేరింది. సుమారు 8 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేసినట్టు వేలం నిర్వహణాధికారి గ్రేసీ మార్గరెట్ తెలిపారు. పొగాకు కొనుగోళ్లు ప్రారంభించి 100 రోజులు పూర్తయిందని, 37 కంపెనీలు పాల్గొన్నాయని చెప్పారు.

జెడ్పీ పనులపై ప్రత్యేక దృష్టి



సమీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారులు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ శుక్రవారం సమీక్షించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ కిట్ల పంపిణీ, డ్రాప్‌అవుట్లు, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా పరిషత్ పనులను వెంటనే పూర్తిచేసి బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలన్నారు. జెడ్పీ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్.నిర్మల జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

ముంపు మండలాల్లో జల విలయం

- భారీ వర్షానికి ఏజెన్సీ అతలాకుతలం
- వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో నిలిచిన రాకపోకలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- వరద ఉధృతికి కొట్టుకుపోయిన రెండు ప్రధాన రహదారులు
- వేలేరుపాడులో 80 ఇళ్లు ధ్వంసం, 120 ఇళ్లకు పాక్షికంగా నష్టం
- గ్రామాల్లో చేరిన వరద నీరు
- ప్రారంభం కాని పునరావాస కేంద్రాలు



వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలోని గుండ్లవాయి వద్ద దెబ్బతిన్న రహదారి



వేలేరుపాడు: కోయ మాధవరం వద్ద రహదారికి పడిన గండి



వేలేరుపాడు: టేకూరు వంతెన వద్ద భారీ గండి



బుట్టాయగూడెం: గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లే రహదారిలో పనులు చేస్తున్న దృశ్యం



బుట్టాయగూడెం: రెడ్డిగణపవరం సమీపంలో వాగు వద్ద పోలీసుల గస్తీ



టి.నరసాపురం: టి.నరసాపురం-మక్కినవారి గూడెం రహదారిపై చేరిన వరద నీరు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాల్లో ప్రజలు భయం గుప్పెట్లో బిక్కుబిక్కుమంటున్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వాగులు, వంకలు పొంగి ఉధృత ప్రవాహం ఒకవైపు.. గోదావరి పొంగిపొర్లడం మరోవైపు ఉండటంతో ముంపు మండలాల్లోని గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రెండు రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఏజెన్సీ గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోవడంతోపాటు ఇళ్లలోకి నీరు చేరి వందల కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. మరోవైపు శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో పోలవరం ప్రాజెక్టు నుంచి దిగువకు 3.12 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో రెండు రోజులపాటు గోదావరి ఉధృతి కొనసాగే అవకాశం ఉంది.

పునరావాసం.. అంతంతమాత్రం

గోదావరికి మళ్లీ వరదలు వచ్చాయి. ప్రతి ఏటా జూలై, ఆగస్టుల్లో వరదలు సంభవించి కొద్దిరోజులు పాటు జనజీవనం స్తంభింపజేసే పరిస్థితి. అయితే గతంలో అధికార యంత్రాంగం ముందస్తుగానే అన్ని చర్యలు తీసుకుని పునరావాస కేంద్రాలు, సహాయక చర్యలపై ఎక్కువ దృష్టి పెట్టేవి. అయితే ఈ ఏడాది మాత్రం ఇంకా పునరావాస కేంద్రాలు ప్రారంభం కాకపోవడం, అలాగే గోదావరి వరదతో పాటు భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. ప్రధానంగా జిల్లాలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వరద ముంపు ఉండగా జంగారెడ్డిగూడెం, చింతలపూడి, బుట్టాయగూడెం ప్రాంతాల్లో కొండ వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

రాకపోకలకు బంద్

వేలేరుపాడు మండలంలో ప్రధాన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు-రుద్రమకోట మధ్య ఉన్న పెదవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వేలేరుపాడు మండల కేంద్రానికి, 29 గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కోయమాధవరం, రామవరం, గుళ్లవాయి నుంచి కూడా వేలేరుపాడుకు రాకపోకలు లేవు. వర్రెపాలెం నుంచి కొయిదా మార్గంలో ఎద్దులవాగు వద్ద వంతెన కొట్టుకుపోవడం, టేకూరువాగు వద్ద అప్రోచ్ రోడ్డు పూర్తిగా మునిగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే పెదవాగు ఉధృతికి వేలేరుపాడు మండలంలోని కుమ్మరిగూడెం గ్రామం పూర్తిగా కొట్టుకుపోయింది. 240 కుటుంబాలు పూర్తి నిర్వాసితులై సమీపంలోని గుట్టలు పైకి చేరారు. ప్రభుత్వం ఇంకా పునరావాస కేంద్రాలు ప్రారంభించలేదు. పాలవాగు పొంగడంతో ఎర్రబోరు-ముత్యాలంపాడు మధ్య రాకపోకలు స్తంభించాయి. రెడ్డిగూడెంలో 5 ఇళ్లు నీటమునగడంతో పాటు పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో రెండు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుట్టాయగూడెం మండలంలో రెడ్డిగణపవరం వద్ద జల్లేరువాగు ఉధృతంగా మారడంతో పాలకుంట, బండారుగూడెం, జీలుగుమిల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలంలోని అల్లూరునగర్, రామవరం ఉదయనగర్, మేడేపల్లి, గుళ్లవాయి, ఊటగుంపు గ్రామాల్లో 80 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మరో 120 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 9 గ్రామాల్లో వరద నీరు చేరడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.

99.1 మి.మీ సగటు వర్షపాతం

ఏలూరు(మెట్రో): జిల్లావ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 99.1 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. వేలేరుపాడు మండలంలో 269 మి.మీ వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా అగిరిపల్లిలో 28.6 మి.మీ వర్షం కురిసింది. బుట్టాయగూడెంలో 268.8, కుకునూరులో 178.8, జంగారెడ్డిగూడెంలో 168.0, జీలుగుమిల్లిలో 141.2, కొయ్యలగూడెంలో 132.8, పోలవరంలో 120.6 మి.మీ అత్యధిక వర్షపాతం నమోదైంది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జంగారెడ్డిగూడెం: జిల్లాలో వరద ప్రమాదం ముగిసే వరకు అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో ఉండాలని కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆదేశించారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా అధికారులకు ఆమె దిశానిర్దేశం చేశారు. వరద ప్రభావిత గ్రామాల్లో రహదారి మార్గాలను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 24 గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. అత్యవసరంగా 80 వేల వాటర్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలని, ఆయా గ్రామాలకు మంచినీటి ట్యాంకులు పంపాలన్నారు. వరదల కారణంగా దెబ్బతిన్న ఇళ్లు, పంటలు తదితర నష్టాలపై నివేదిక ఇవ్వాలన్నారు. జిల్లాస్థాయిలో 24 గంటలూ పనిచేసేలా టోల్‌ఫ్రీ ఫోన్ 1800 233 1077 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామన్నారు. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ విపత్తు నిర్వహణపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని జిల్లా అధికారి స్థాయి నుంచి గ్రామంలోని చివరి స్థాయి సిబ్బంది వరకు అందించేందుకుగాను పటిష్టమైన సమాచార వ్యవస్థను ఏర్పాటుచేసుకోవాలన్నారు. జేసీ బి.లావణ్యవేణి, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ మాట్లాడుతూ కాజ్‌వేల వద్ద రాకపోకలు లేకుండా బారికేడ్లు ఏర్పాటుచేయాలన్నారు. ఆర్డీఓ కె.అద్దయ్య, డీఎంహెచ్ఓ శర్మిష్ట, డీపీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తమ్మిలేరు.. జలహోరు



తమ్మిలేరు ప్రాజెక్టులో గేట్లను తాకుతున్న నీరు

చింతలపూడి: మెట్ట ప్రాంతంలోని ప్రాజెక్టులు, చెరువుల్లోని భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. వరద మరింత పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఖమ్మం జిల్లా బేతుపల్లి నుంచి తమ్మిలేరు రిజర్వాయర్‌కు శుక్రవారం కూడా వరద కొనసాగింది. అధికారులు ప్రాజెక్టు వద్దే మకాం వేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 341.68 అడుగులకు చేరుకుంది. గోనెలవాగు స్టోరేజ్ ట్యాంక్ నీటిమట్టం 338.1 అడుగులకు చేరుకుందని తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ యు. పరమానందం తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 3 టీఎంసీలు కాగ ప్రస్తుతం 1.026 టీఎంసీలకు నీరు చేరిందన్నారు. బేతుపల్లి అలుగుపై నుంచి గంటకు 3,749 క్యూసెక్కుల నీరు ఆంధ్రా కాల్వ ద్వారా తమ్మిలేరు ప్రాజెక్టులోకి వస్తోందన్నారు. ప్రాజెక్టులో 350 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చని, ప్రాజెక్టు నీటిమట్టం 348 అడుగులకు చేరుకున్న తర్వాత వరద పరిస్థితిని అంచనా వేసి గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తామన్నారు.

గుండేరు వాగు వంతెనకు కోత



కోతకు గురైన వంతెన

కుకునూరు: భారీ వర్షాలకు కుక్కునూరు నుంచి దాచారం వెళ్లే రహదారిలోని గుండేటి వాగు వంతెన కోతకు గురైంది. దీంతో ఇటుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఉప్పేరు పంచాయతీలో రెడ్డిగూడెం వాగు వరద ఉధృతికి రెడ్డిగూడెం గ్రామంలో ఐదు ఇళ్లు నీటమునిగాయి. వేలేరు నుంచి కుక్కునూరు మార్గంలో విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

పెరుగుతున్న గోదావరి : గోదావరికి వరద నీరు పెరుగుతోంది. శుక్రవారం సాయంత్రానికి కుక్కునూరులో గోదావరిలో నీరు 26 అడుగులకు చేరుకుంది.

జల్లేరు జలాశయానికి భారీగా..

బుట్టాయగూడెం: దొరమామిడి సమీపంలోని గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయంలోకి వరద నీరు పోటెత్తింది. రెండు రోజులుగా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయం సామర్థ్యం 217.80 మీటర్లు కాగా ప్రస్తుతం 216 మీటర్లకు నీరు చేరింది. జలాశయంలోని రెండు గేట్లు ఎత్తి సుమారు 1,500 క్యూసెక్కుల నీటిని ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. అలాగే మండలంలోని చింతలగూడెం సమీపంలోని పోగొండ రిజర్వాయర్‌లో కూడా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు సామర్థ్యం 157 మీటర్లు కాగా అంతకు మించి వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది.

ఎర్రకాలువ ఉగ్రరూపం



ఎర్రకాలువ జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం



పట్టెన్నపాలెంలో జల్లేరు వాగు ఉధృతికి కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డు

జంగారెడ్డిగూడెం రూరల్: భారీ వర్షాలకు మండలంలోని కొంగువారిగూడెం శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం ఉగ్రరూపం దాల్చింది. జలాశయంలోకి ఉదయం 6 గంటల సమయంలో 30,153 క్యూసెక్కుల వరద నీరు రాగా డ్యాం గేట్లను ఎత్తి గంటకు 17,306 క్యూసెక్కులు, మధ్యాహ్నం 17,250 క్యూసెక్కుల నీరు రాగా 17,250 క్యూసెక్కులు, సాయంత్రం 12,500 క్యూసెక్కుల నీరు రాగా 12,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచినట్టు ఇరిగేషన్ శాఖ డీఈ రాంబాబు తెలిపారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 83 మీటర్లకు చేరింది. ఎర్రకాలువ జలాశయం ప్రాంతాన్ని ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ దేవప్రకాష్, లక్కవరం ఎస్సై సుధీర్ పరిశీలించారు. వరద ముంపుతో పొలాలకు తీవ్రం నష్టం వాటిల్లుతుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని దేవప్రకాష్ అన్నారు.

పొంగుతోన్న జల్లేరు వాగు

పట్టెన్నపాలెంలో జల్లేరు వాగు ఉధృతంగా ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతికి డైవర్షన్ రహదారి ధ్వంసమైంది. మండలంలోని పంగిడిగూడెం, లక్కవరం, పుట్లగట్లగూడెం తదితర ప్రాంతాల్లో వరినాట్లు వేసిన పొలాలు నీట మునిగాయి. ముంపు చేలను జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, కేఆర్ పురం వ్యవసాయశాఖ ఏడీఏ బుజ్జిబాబు, మండల వ్యవసాయాధికారి పోశారావు పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు.

పునరావాస కేంద్రాలకు తరలిరండి



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న జేసీ లావణ్యవేణి

వేలేరుపాడు: మండలంలోని పెదవాగు ముంపు ప్రాంతాలను జేసీ బి.లావణ్యవేణి శుక్రవారం పరిశీలించారు. నిరాశ్రయులైన అల్లూరినగర్‌లో కుటుంబాలను పరామర్శించి పునరావాస కేంద్రాలకు రావాలని కోరారు. వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండాలన్నారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వరద బాధితులను ఆదుకుంటాం

కలెక్టర్ వెట్రి సెల్వి

వేలేరుపాడు: పెదవాగు ప్రవాహానికి వరద బారిన పడిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని కలెక్టర్ కె.వెట్రి సెల్వి అన్నారు. వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన అల్లూరినగర్, రామవరం ఉదయ్‌నగర్, గుండ్లవాయి, మేడేపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించి బాధితులను పరామర్శించారు. బాధితులను వరద సహాయక కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. అనంతరం పెదవాగు ప్రాజెక్టు గండి పడిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. వరద నీటిని విడుదల చేసే 12 గంటల ముందు తెలియజేస్తే ప్రమాదాన్ని నివారించవచ్చని తెలంగాణ ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

కాలినడకన కలెక్టర్ పర్యటన

మేడేపల్లి నుంచి అల్లూరినగర్‌కు వాహనంలో వచ్చిన కలెక్టర్ అక్కడి నుంచి సుమారు 2 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై గుండ్లవాయి, రామవరం ఉదయ్‌నగర్, కోయ మాధవరం గ్రామాల్లో పర్యటించారు. వేలేరుపాడుకు మోటార్‌సైకిల్‌పై వెళ్లి అక్కడ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. జేసీ బి.లావణ్యవేణి, ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, ఆర్డీఓ కె.అద్దయ్య తదితరులు ఉన్నారు.



కాలినడకన వేలేరుపాడు వెళుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి, ఎస్పీ శివకిషోర్

క్లుప్తంగా

శిలాఫలకంపై పెయింట్



మార్కెట్ కమిటీ ఆవరణ గోడకు ఏర్పాటు చేసిన శిలా ఫలకంపై ఉన్న ఫొటోలపై పెయింట్ వేసిన దృశ్యం

చింతలపూడి : చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణ గోడకు ఏర్పాటు చేసిన శిలా ఫలకంపై ఉన్న ఫొటోలను గుర్తు తెలియని వ్యక్తులు పెయింట్ వేసి చెరిపి వేశారు. ఈ సంఘటన జరిగి కొద్ది రోజులు కావస్తున్నా ఇంత వరకు ఎవరు పట్టించుకో లేద. మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా 2022లో పాలక వర్గం జాబితా పేర్లతో ఉన్న శిలాఫలకాన్ని ఆవరణ గోడకు ఏర్పాటు చేశారు. శిలా ఫలకంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, మాజీ శాసన సభ్యులు ఉన్నమట్ల ఎలీజా, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డిల ఫోటోలను ముద్రించారు. ఈ సంఘటనలపై అధికారులకు ఫిర్యాదు చేస్తామని వైసీపీ నాయకులు తెలిపారు.

వెంకటనారాయణ మృతదేహం లభ్యం

భీమవరం: భీమవరం పట్టణం గులాబీ సెంటర్‌కు చెందిన గొంట్ల వెంకటనారాయణ ఈనెల 18వ తేదిన అదృశ్యమైనట్లు కేసు నమోదు కాగా అతని మృతదేహం శుక్రవారం నాగిడిపాలెం కాలువలో లభించినట్లు టుటౌన్ ఏఎస్ఐ దేవరాజ్ చెప్పారు. వెంకటనారాయణ అదృశ్యమైనట్లు అతని భార్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వెంకటనారాయణ మోటారు సైకిల్ సెల్‌ఫోన్ నాగిడిపాలెం బ్రిడ్జి వద్ద లభించడంతో కాలువలో గాలించగా మృతదేహం లభించిందన్నారు. మిస్సింగ్ కేసును అనుమానదస్పద మృతిగా మార్చి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు దేవరాజ్ చెప్పారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: మహిళ అదృశ్యంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాలు ప్రకారం.. భీమడోలు మండలం సూరప్పగూడెంకు చెందిన మద్దాల ధనలక్ష్మికి ముగ్గురు ఆడపిల్లలు సంతానం కాగా, అందులో పెద్ద కుమార్తెకు, చిన్న కుమార్తెకు వివాహాలయ్యాయి. రెండవ కుమార్తె మద్దాల చిట్టిమ్మ గత 5 సంవత్సరాల నుంచి భీమడోలులోని రాజు బిర్యాని హోటల్‌లో పనిచేస్తూ, ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలోని తన అక్క ఇంటి వద్ద ఉంటోంది. ఇదిలా ఉంటే గత నెల 28 న తల్లి ధనలక్ష్మికి ఆమె పెద్ద కుమార్తె ఫోన్ చేసి, చిట్టిమ్మ కనిపించడం లేదని చెప్పింది. అప్పటి నుంచి ఎంత వెదికినా ఫలితం దక్కలేదు. హోటల్ యాజమానిపై అనుమానం ఉన్నట్టు ధనలక్ష్మి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ట్రిపుల్ ఐటీ.. బోధనలో మేటి

22, 23 తేదీల్లో నూజివీడు ట్రిపుల్‌ఐటీలో కౌన్సెలింగ్

నూజివీడు : రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈ విద్యా సంవత్సరంలో ఈ నెల 22 నుంచి 27 వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఈ నెల 22, 23 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహణకు ట్రిపుల్‌ఐటీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ విద్యాబోధనలో భాగంగా ఆహ్లాదకరమైన వాతావరణం, క్రమశిక్షణ, ఉత్తమ విద్యాబోధన, ఉన్నత సామాజిక స్పృహ నూజివీడు ట్రిపుల్ ఐటీ సొంతం. విద్యతో పాటు విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడలు, శాస్త్రీయ సంగీతం, నాట్యం, యోగా వంటి మైనర్ కోర్సులు ఇక్కడ ప్రత్యేకం. వీటిల్లో నిత్యం ఇక్కడ శిక్షణనిస్తారు.

రెండ్రోజుల్లో 1,100 మందికి కౌన్సెలింగ్

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లో భాగంగా రెండు రోజుల్లో 1100 మందికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అభ్యర్థులందరికీ ఇప్పటికే ట్రిపుల్ ఐటీ అధికారులు కాల్‌లెటర్లు పంపడంతో పాటు వారి సెల్‌ఫోన్‌లకు మెసేజ్‌లు పంపారు. ఉదయం అల్పాహారం అనంతరం అసెంబ్లీ, 8 గంటల నుంచి 12 గంటల వరకు తరగతులు, 12 నుంచి ఒంటి గంట వరకు భోజన విరామం, మళ్ళీ ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు, అనంతరం టీ, స్నాక్స్, 6 గంటల వరకు ఆటలు, రాత్రి 7 గంటలకు భోజనం, రాత్రి 10 గంటల వరకు స్టడీ అవర్స్ ఉంటాయి.



నూజివీడు ట్రిపుల్ ఐటీ

ట్రిపుల్‌ఐటీ ప్రత్యేకతలు

- ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ విద్యలో మొదటి రెండు సంవత్సరాలు ఇంటర్‌కు సమానమైన పీయూసీ కోర్సును, తరువాత నాలుగేళ్లు ఇంజినీరింగ్ విద్యను బోధిస్తారు.
- ట్రిపుల్‌ఐటీలో చేరిన తరువాత విద్యార్థులు మొదటి రెండు సంవత్సరాలు(పీయూసీ) ఏడాదికి రూ.45 వేలు, తరువాత నాలుగు సంవత్సరాలు(ఇంజినీరింగ్) ఏడాదికి రూ.50 వేలు చొప్పున చెల్లించాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత కలిగిన విద్యార్థులకు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రభుత్వం చెల్లించిన నగదుపోను మిగిలిన సొమ్మును విద్యార్థులే చెల్లించాల్సి ఉంటుంది.
- అన్ని సబ్జెక్టులకు ప్రతినెలా పరీక్షలు ఉంటాయి. నాలుగు నెలల తరువాత సెమిస్టర్ పరీక్షలు ఉంటాయి. ప్రతి సెమిస్టర్ 24 వారాలు ఉంటుంది. వేసవి సెలవులు కేవలం 3 వారాలు మాత్రమే ఉంటాయి. ఆగస్టు మొదటి వారంలో తరగతులు ప్రారంభమై నవంబరు 30 వరకు జరుగుతాయి. అనంతరం సెమిస్టర్ పరీక్షలు ఉంటాయి. పీయూసీలో ఆరు సబ్జెక్టులుంటాయి. ఆంగ్లం(రెండు పేపర్లు), గణితం(రెండు పేపర్లు), భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, తెలుగు, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ సబ్జెక్టులుంటాయి.
- సెలవు రోజులలో తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలతో గడపడానికి అవకాశం ఉంటుంది. అత్యవసర పరిస్థితులలో పిల్లలను అవసరమైతే ఇళ్ళకు పంపుతారు. ఇచ్చిన గడువులోగా రాకపోతే ఫైన్ విధిస్తారు.
- విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. దీనికి ట్రిపుల్‌ఐటీ ఆవరణలోనే 30 పడకల ఆసుపత్రి ఉంది. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉంటారు.
- రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.వెయ్యి, ఎస్సీ ఎస్టీలు అయితే రూ.500 చెల్లించాలి. రిఫండబుల్ కాషన్ డిపాజిట్ కింద ప్రతి అభ్యర్థి రూ.2 వేలు అడ్మిషన్ సమయంలో చెల్లించాలి.

కౌన్సెలింగ్‌కు అవసరమైనవి

పదోతరగతి హాల్‌టికెట్, పదో తరగతి గ్రేడ్ షీట్, పదో తరగతి టీసీ, కాండక్ట్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్(4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు), మీసేవా కేంద్రం నుంచి తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, ఈ ఏడాది ఏప్రిల్ తరువాత మీసేవా కేంద్రం ద్వారా తీసుకున్న ఆదాయ ధృవ పత్రం, అభ్యర్థి, అతని తండ్రి, తల్లిది రెండు పాసు పోర్టు ఫొటోలు, రేషన్‌కార్డు, అభ్యర్థి ఆధార్‌కార్డు, విద్యార్థులకు ఎవరికైనా బ్యాంకు లోన్ అవసరమైతే పైన పేర్కొన్న సర్టిఫికెట్లన్నీ నాలుగు సెట్లు, అభ్యర్థి తండ్రి ఉద్యోగి అయితే ఎంప్లాయి ఐడెంటీ కార్డు, శాలరీ సర్టిఫికెట్, అభ్యర్థి తండ్రి పాన్‌కార్డు, ఆధార్ కార్డు, వోటర్ ఐడీ కార్డు తెచ్చుకోవాలి.

నర్సాపురం ఎంపీడీఓ కోసం గాలింపు



తోటగూడెం కాల్వలో వెతుకుతున్న హనుమాన్ జంక్షన్ పోలీసులు

దెందులూరు: అదృశ్యమైన నర్సాపురం ఎంపీడీఓ కోసం గాలిస్తున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం దెందులూరు నియోజకవర్గంలో కృష్ణా కాల్వ తోటగూడెంలో హనుమాన్ జంక్షన్ పోలీసులు గాలింపు చేపట్టారు. అసిస్టెంట్ ఇంజనీర్లు లస్కర్లను అప్రమత్తం చేశారు. ఎలాంటి సమాచారం తెలిసినా హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్‌కు తెలియచేయాలని సూచించారు.

చోరీ కేసులో 6 నెలల జైలు

నరసాపురం: దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో వీరవాసరం మండతం బొబ్బనపల్లికి చెందిన కట్టా సుబ్బారావుకు శుక్రవారం నరసాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్టు కోర్టు లైజన్ అధికారి, ఏఎస్సై ఉదయభాస్కరరావు చెప్పారు. గత ఏడాది డిసెంబర్ 10న యలమంచిలి మండలం గుంపర్రు గ్రామానికి చెందిన జడ్డు శ్రీనివాస్ తల్లికి ఆరోగ్యం బాగోకపోవడంతో హైదరాబాద్ వెళ్లాడు. 15వ తేదీ ఇంటికి రాగా తలుపులు తీసి ఉండటంతో గమనించి ఇంట్లో సుమారు 5 కాసుల బంగారు వస్తువులు చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యలమంచిలి ఎస్సై శివన్నారాణ క్లూస్‌టీమ్ రప్పించి దర్యాప్తుచేసి సుబ్బారావు దొంగతనం చేసినట్టుగా గుర్తించి అరెస్ట్ చేశారు.

చర్మ వ్యాధితో పాల ఉత్పత్తిపై ప్రభావం

నేటి నుంచి ముద్ద చర్మవ్యాధి టీకాల పంపిణీ

జంగారెడ్డిగూడెం : పశువులకు వచ్చే ముద్ద చర్మ వ్యాధి (లంపీ స్కిన్ డిజీస్) పాల ఉత్పత్తిపై అధిక ప్రభావం చూపుతుంది. ఈ వ్యాధి సోకిన పశువుల చర్మంపై ముద్దలు, గడ్డలు ఏర్పడుతాయి. ఈ వ్యాధి వల్ల పశువులు చాలా ఇబ్బంది పడతాయి. వీటి నివారణకు ఈ నెల 20 నుంచి పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ముద్దచర్మ వ్యాధి టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని పశువులకు టీకాలు వేయించుకోవాలని పశువైద్యాధికారి బీఆర్ శ్రీనివాసన్ తెలిపారు.

వ్యాధి లక్షణాలు

- పశువుల శరీరంపై చిన్న గడ్డలు, ముద్దలు ఏర్పడతాయి.
- పశువులకు అధిక జ్వరం వస్తుంది.
- పశువులు బలహీనంగా, అలసటగా కనిపిస్తాయి.
- పశువులు ఆహారం తీసుకోకపోవడం లేదా తక్కువగా తీసుకుంటాయి.
- ముద్ద చర్మ వ్యాధి సోకిన పశువులు తక్కువ పాలు ఇస్తాయి.

వ్యాధి వ్యాప్తి:

ముద్ద చర్మ వ్యాధి వైరస్ పశువుల నుంచి పశువులకు దోమలు, ఇతర కీటకాలు ద్వారా వ్యాపిస్తుంది. వ్యాధి ఉన్న పశువుల నుంచి ఇతర పశువులకు వ్యాపిస్తుంది.

నివారణ, చికిత్స

వ్యాక్సిన్ వలన ముద్ద చర్మ వ్యాధి నివారణ సాధ్యమవుతుంది.



ముద్ద చర్మ వ్యాధి సోకిన పశువులు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- పశువుల నివాస ప్రదేశాలను శుభ్రంగా ఉంచాలి.
- ముద్ద చర్మ వ్యాధి సోకిన పశువులను ఇతర పశువుల నుంచి వేరుగా ఉంచాలి.
- పశువులకు దోమల నుంచి రక్షణ కల్పించాలి.
- పశువులకు సమయానికి వ్యాక్సిన్ వేయించాలి
- ఏదైనా లక్షణాలు గమనిస్తే వెంటనే స్థానిక వెటర్నరీ వైద్యులను సంప్రదించాలి.

ప్రభుత్వ చర్యలు

భారతదేశంలో ప్రభుత్వం గోట్ పాక్స్ వైరస్ వ్యాక్సీన్‌ను అందిస్తూ ఉంది, ముద్ద చర్మ వ్యాధి నివారణ కోసం వ్యాక్సినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. సొసైటీల ద్వారా ప్రభుత్వ ఉచితంగా సేవలు అందిస్తోంది. అలాగే రైతులకు, పశువుల యజమానులకు ఈ వ్యాధి నివారణ, చికిత్స పట్ల అవగాహన కల్పిస్తోంది. ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి.

పాడి - పంట

వ్యాక్సిన్‌తో వ్యాధి నుంచి రక్షణ



ముద్ద చర్మవ్యాధి పశువులకు ప్రమాదకరం. సరైన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న గోట్ పాక్స్ వైరస్ వ్యాక్సిన్ వినియోగిస్తే, ఈ వ్యాధి నుంచి పశువులను కాపాడుకోవచ్చు. ప్రతి రైతు పశువైద్యాధికారుల సలహాలు పాటించి తమ పశువులను ఆరోగ్యంగా ఉంచుకోవాలి. ఈ నెల 20వ తేదీ నుంచి పశువుల కోసం ముద్దచర్మ వ్యాధి నివారణ వ్యాక్సిన్ అందిస్తాం.

– బీఆర్ శ్రీనివాసన్, పశువైద్యాధికారి

చూడి గేదెలలో జాగ్రత్తలు

మండవల్లి : చూడి గేదెల విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు. ఒక్కోసారి ఈనలేకపోవడానికి పలు కారణాలు ఉన్నాయి. గేదె శరీర పరిస్థితి, గర్భం మెలిపడుట వల్ల ఈనేటప్పుడు ఇబ్బంది పడతాయి. గేదెలలో గర్భం మెలిపడుట అంటే.. గేదె గర్భం దాని దీర్ఘ అక్షం మీద తిరుగబడుట. చూడి గేదెలలో ముఖ్యంగా అప్‌ల్యాండ్ ఏరియాలో ఉన్న గేదెలలో ఆఖరిదశ చూడిలో గర్భం మెలిపడుతుంది.

లక్షణాలు

ఎక్కువగా ఉత్సాహంగా, గెంతులు వేస్తుంటాయి.

కారణాలు

చూడి గేదెలో బ్రాడ్లిగ్‌మెంట్(విస్తృత స్నాయువు) నిర్మాణం అతికిఉండటం ముఖ్య కారణం. ఎందుకంటే పిండం లోపల గ్రావిడ్ కొమ్ము బరువు పెరిగే కొద్దీ అది స్వేచ్ఛగా ఊగుతుంటుంది. ఎప్పుడైతే గేదె ఎగుడు దిగుడుగా నున్న గుంటల్లో పరిగెడుతుందో మెలిపడే శాతం పెరుగుతుంది. గర్భం లోపల పిండం కదలిక ఎక్కువగా ఉండడం వల్ల కూడా మెలిపడే అవకాశం అధికంగా ఉంటుంది. చూడి గేదెలలో రవాణా చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే మెలిపడే అవకాశం ఎక్కువ. గేదె మేత తినడం, నెమరు వేయడం ఆపేసి విపరీతమైన కడుపునొప్పితో గిల గిలా కొట్టు కుంటుంది. ఆ సమయంలో వెంటనే గమనించాలి. తక్షణం వైద్య సాయం అందించాలి.



మెలిక తీసిన తర్వాత దూడను లాగుతున్న దృశ్యం

చికిత్స

గేదెను తిప్పడం, లోపలి పిండం తిప్పడం, సిజేరియన్ చేయడం వంటివి పశువైద్యుడి పర్యవేక్షణలో చేయాలని మండవల్లి పశువైద్య సంచాలకుడు చెప్పారు.

నీటమునిగిన నారుమళ్ల సస్యరక్షణ ఇలా

భీమవరం: జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న అధిక వర్షాల కారణంగా ప్రస్తుత సార్వా వరినాట్లు, నారుమళ్లు అనేకచోట్ల నీటమునుతున్నాయి. జిల్లాలో 10,880 ఎకరాల్లో నారుమడి వేయగా దీనిలో 1,240 ఎకరాల్లో నారుమళ్లు నీట మునిగాయి. 36,299 ఎకరాల్లో నాట్లు వేయగా 6,194 ఎకరాల్లో నాట్లు ముంపునకు గురయ్యాయి. ముంపునకు గురైన వరినాట్లు, నారుమళ్లకు సరియైన యాజమాన్య పద్ధతులను పాటించాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు చెప్పారు.

విత్తనం చల్లిన రెండు, మూడు రోజుల్లో ముంపునకు గురైతే మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది. అందువల్ల రైతులు నారుమడిలో వీలైనంత త్వరగా నీళ్ళు పూర్తిగా బయట తీసివేయాలి. దీనివల్ల విత్తనం గాలి పోసుకొని మొలక త్వరగా వస్తుంది. నీరు తీయడానికి వీలు లేక మొలక దెబ్బ తింటే తిరిగి విత్తనం చల్లుకోవాలి. విత్తనం 7–30 రోజుల మధ్యలో నారుమడి 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బ తినే అవకాశం ఉంది. నీట మునిగిన 5 రోజుల లోపు నీటిని పూర్తిగా బయటకు తీసి నారుమడికి గాలి తగిలేలా చేయాలి. తర్వాత 5 సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వల్ల కొత్త ఆకు వచ్చి నాట్లు వేయడానికి వీలుగా ఉంటుంది. వర్షాల కారణంగా నారుమడిలో తెగుళ్ల ఎక్కువగా ఆశించే అవకాశం ఉన్నందున నీటిని పూర్తిగా బయటకు తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తర్వాత తెగుళ్ళ నివారణకు గ్రాము కార్బన్‌డిజం లేదా కార్బన్‌డజిం, మాంకోజెట్ మిశ్రమం రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి పైపాటుగా పిచికారి చేసుకోవాలి.



పెనుమంట్ర మండలం పొలమూరులో నీట మునిగిన వరినాట్లు

నాట్లు వేసిన చేలలో

వరినాట్లు ముంపునకు గురైతే నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పైపాటుగా ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను బూస్టర్ డోస్‌గా వేసుకోవాలి. నీరు పూర్తిగా తీయకుంటే ఆకుపై రెండు శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్ పిచికారి చేయడం ప్రయోజనకరం. వరినాట్లు పూర్తిగా కోలుకున్న తర్వాత మాగుడు తెగులు, ఇతర కుళ్ళు తెగులు సోకకుండా కార్బన్‌డిజం గ్రాము లేదా కార్బన్‌డిజం, మాంకొటేట్ మిశ్రమం మందు రెండు గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి పైపాటుగా పిచికారి చేయాలి.

విత్తనం వెదజల్లిన చేలలో

వరి విత్తనం వెదచల్లిన వెంటనే అధిక వర్షాలు వలన మొలక శాతం దెబ్బ తింటుంది. రైతులు వర్షాలు తగ్గిన వెంటనే నీరు బయటకు పోవడానికి కాల్వలు ఏర్పాటు చేసుకొని వీలైనంత త్వరగా నీటిని పూర్తిగా బయటకు తీసి గాలి సోకే విధంగా చేయాలి. దీనివల్ల మొలక త్వరగా వస్తుంది. విత్తనం 10–30 రోజుల లోపు 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే వరి దెబ్బతినే అవకాశం ఉంది. నీట మునిగిన 5 రోజుల లోపు నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పంటకు గాలి తగిలేలా చేయాలి. పై పాటుగా ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులు బూస్టర్ డోస్‌గా వేసుకోవాలి. నీరు పూర్తిగా తీయకుంటే ఆకుపై రెండు శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారి చేయడం వల్ల పైరు త్వరగా కోలుకుంటుంది. వరిపైరు కోలుకున్న తర్వాత తెగుళ్ళ వ్యాప్తి నివారణకు గ్రాము కార్బన్‌డిజం లేదా కార్బన్‌డిజం, మాంకోజెట్ మిశ్రమ మందు రెండు గ్రాములు చొప్పున లీటరు నీటిల్లో కలిపి పైపాటుగా పిచికారి చేసుకోవాలని వెంకటేశ్వరరావు చెప్పారు.

ఆన్‌లైన్ యాప్‌తో మోసం

భీమవరం : ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయామంటూ భీమవరం వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన కొంత మంది శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చైన్ లింక్ ద్వారా తక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే భారీగా ఆదాయం వస్తుందంటూ ఓ యాప్ ద్వారా ప్రచారం చేయడంతో అదనపు ఆదాయం సమకూరుతుందనే ఆలోచనతో పెట్టుబడి పెట్టామంటున్నారు. శాంసంగ్ బ్రాండ్ లోగో ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడం ఎస్‌బీఐ గ్యారంటీ ఉందని చూపడంతో నమ్మి పెట్టుబడి పెట్టామని అయితే తమకు ఎటువంటి ఆదాయం రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. పోలీసుల వివరణ కోరగా ఎటువంటి కేసు నమోదు కాలేదని స్పష్టం చేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

చాట్రాయి : విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కోటపాడులో జరిగింది. గ్రామానికి చెందిన జుజ్జవరపు కృష్ణ(37) శుక్రవారం ఉదయం ఇంటిపక్కనే ఉన్న మోటార్ స్విచ్ ఆపుతుండగా బాక్సులో తెగి ఉన్న వైరు తగలడంతో షాక్ తగిలి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులున్నారు.